సాక్షి ఒడిశా
ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,45,300
బంగారం	2 గ్రాముల 450 మిల్లీ గ్రాములు
వెండి	11 గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



గాయత్రీమాతా పాహిమాం!

శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం అమ్మవారు గాయత్రీమాత రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

- 8లో



ఉపాధితోనే వలసలకు అడ్డుకట్ట

యువకులకు స్థానికంగా ఉపాధి కల్పిస్తే వలసలకు అడ్డుకట్ట వేయవచ్చని వక్తలు పేర్కొన్నారు. మోహానా బ్లాక్ కార్యాలయంలో పంచాయతీ సమావేశం నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

గవర్నర్‌తో వీసీ భేటీ



గవర్నర్‌తో మాట్లాడుతున్న వీసీ జయదీప్

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్ రఘుబరదాస్‌తో సిలికాన్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టరు జయదీప్ తాలూక్‌దార్ భేటీ అయ్యారు. రాజ్‌భవన్‌లో శనివారం వీరిద్దరూ కలిసి పలు అంశాలపై చర్చించారు.

రాష్ట్రస్థాయిలో బాజీరౌత్ జయంతి



బాజీ రౌత్‌కు పుష్పాంజలి ఘటించిన సీఎం మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: అమర వీరుడు బాజీ రౌత్ జయంతి పురస్కరించుకుని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సరికొత్త ప్రకటన చేశారు. ఇకపై ఏటా రాష్ట్రస్థాయిలో బాజీ రౌత్ జయంతి ఉత్సవం ప్రభుత్వం నిర్వహిస్తుందని శనివారం ప్రకటించారు. రాష్ట్రంలో అతి పిన్న స్వాతంత్ర్య సమరయోధుడిగా బాజీ రౌత్ అలుపెరుగని పోరాటం చేశారని, ఆయన త్యాగం మరువలేనిదని కొనియాడారు. 12 ఏళ్ల చిరుప్రాయంలో తెల్లదొరల పాలనకు వ్యతిరేకంగా పోరాడి బుల్లెట్లకు బలయ్యారని గుర్తు చేశారు.

రక్తదానం అభినందనీయం



రక్తదానం చేస్తున్న దాతలు

రాయగడ: స్థానిక లయన్స్ క్లబ్ ప్రాంగణంలో శనివారం లయన్స్, వాకర్స్ క్లబ్‌లు సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించి 91 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ బిష్ణు ప్రసాద్ పాత్రో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. క్లబ్‌లు సమాజ హిత కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమని కొనియాడారు. బ్లడ్‌బ్యాంక్ అధికారి డాక్టర్ గౌతం పట్నాయక్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో డాక్టర్ వీఎల్ఎన్ రాజు, క్లబ్‌ల ప్రతినిధులు డి.కె.మహంతి, ప్రతాప్‌చంద్ర బౌరి, మురళి కృష్ణ సత్యవాది పతి, ప్రణిష్త పాత్రో, శంకర్షన్ మంగరాజ్ పాల్గొన్నారు.

పడవ బోల్తాపడి యువకుడు మృతి



బాలరామ్ మృతదేహం

మల్కన్‌గిరి : చిత్రకొండ సమితి బోఢపోఢ పంచాయతీ ఘజుర్‌గుమ్మ గ్రామానికి చెందిన బాలరామ్ హంతాల్(26) శుక్రవారం సాయంత్రం చిత్రకొండ జలాశయంలో పడవ బోల్తాపడిన ఘటనలో మృతిచెందాడు. గురుప్రియ వంతెన సమీపంలో ఒంటరిగా చేపల వేట సాగిస్తుండగా పడవ అదుపు తప్పి బోల్తా పడటంతో ఈ దుర్ఘటం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న స్థానికులు శనివారం ఉదయం నుంచి గాలించగా ఓ రాయి చాటున మృతదేహం లభ్యమైంది. వెంటనే చిత్రకొండ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు ఐఐసీ ముకుందో మేల్క తెలిపారు.

మహానదిలో బాలుడి మృతదేహం లభ్యం



మనోరంజన్ బెహరా (ఫైల్)

భువనేశ్వర్: కటక్ జగత్‌పూర్ పారిశ్రామికవాడలో బల్లిసాహి వద్ద మహానది తీరంలో శుక్రవారం గల్లంతైన ఇద్దరు బాలురులో రెండో మృతదేహం కూడా లభ్యమైంది. స్థానిక రాజకిషోర్ విద్యాపీఠంలో 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు స్నానంచేసేందుకు వెళ్లి తిరిగి రాకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. అగ్నిమాపక దళం రెండు రోజులపాటు శ్రమించగా మనోరంజన్ బెహరా మృతదేహం గుర్తించారు. ఇంతకుముందే ఆర్యన్ నాయక్ మృతదేహాన్ని గాలించి ఒడ్డుకు చేర్చారు.

గంజాయి కేరాఫ్.. చిత్రకొండ



స్వాభిమాన్ ఏరియాలో గంజాయి సాగు



బోడపోఢ పంచాయతీలో గిరిజనులతో చర్చిస్తున్న కలెక్టర్ ఆశిష్ పటేల్

- జీవనాధారంగా మార్చుకున్న మెజారిటీ ప్రజలు
- బీఎస్ఎఫ్, ఎక్సైజ్, పోలీసుల కళ్లు గప్పి అక్రమ రవాణా
- గిరిజనులను మభ్యపెడుతున్న దళారులు
- తరచూ దాడులతో క్రమంగా తగ్గుతున్న సాగు



పెప్పరమెట్లలో ఇంటి వద్ద గంజాయి తయారు చేస్తూ..

మల్కన్‌గిరి :

మల్కన్‌గిరి జిల్లాలోని చిత్రకొండ సమితి గంజాయి సాగుకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా ఉన్న చిత్రకొండలో గంజాయి సాగే జీవనాధారంగా మెజారిటీ గిరిజనులు బతికేవారు. 2016లో గురుప్రియ వంతెన అందుబాటులోకి వచ్చిన తర్వాత మావోయిస్టులను అణచివేసేందుకు పోలీసులు, బీఎస్ఎఫ్ జవాన్లు రంగంలోకి దిగారు. ఈ ప్రాంతాన్ని మౌలిక సదుపాయాలపరంగా అభివృద్ధి చేస్తే మావోయిస్టులను సులువుగా తరిమికొట్టవచ్చని స్వాభిమాన్ ఏరియాలో తొమ్మిది పంచాయతీల్లో 6 బీఎస్ఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేశారు. తరచూ కూంబింగ్ నిర్వహించి మావోయిస్టులను వెళ్లగొట్టారు. అదే సమయంలో గంజాయి సాగు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉండటాన్ని గమనించిన పోలీసులు ఎక్కడికక్కడ గంజాయి సాగును ధ్వంసం చేశారు. ఒకప్పుడు ఏటా ఐదు వేల ఎకరాల్లో గంజాయిని సాగు చేసేవారు. బీఎస్ఎఫ్ క్యాంపులు వెలిశాక సాగు తగ్గింది.



గంజాయి సాగును ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది



గంజాయి మొక్కలకు నిప్పు పెడుతున్న దృశ్యం

అమాయకత్వం ఆసరాగా..

ఇక్కడ దట్టమైన అడవుల్లో బతికే గిరిజనుల అమాయకత్వాన్ని కొందరు దళారులు ఆసరాగా చేసుకున్నారు. గంజాయి సాగుకు ప్రోత్సహించి కోట్లు దండుకుంటున్నారు. ఎంతోకొంత ముట్టచెప్పి అక్రమ రవాణా మార్గాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గిరిజనుల వద్ద అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. చిత్రకొండ సమితిలోని బోడపోడ, హంతాల్‌గూడ, పేప్పరమేట్ల, సన్యసిగూడ, రల్లేగూడ, గుర్రసేత్ తదితర పంచాయతీలు గంజాయి సాగుకు పేరుగాంచాయి. ఇక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ తదితర అక్రమ మార్గాల్లో రవాణా చేస్తున్నారు. పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది తరచూ దాడులు చేసి గంజాయి మొక్కలను కాల్చివేస్తుండటంతో ఇటీవల కాలంలో సాగు బాగా తగ్గింది.

కలెక్టర్ చొరవ..

గంజాయి సాగును మాన్పించేందుకు మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ ఆశిష్ చొరవ తీసుకుంటున్నారు. స్వాభిమాన్ ఏరియాకు తరచూ వెళ్లి గంజాయిని సాగు చేయవద్దని గిరిజనులకు సూచిస్తున్నారు. దాని బదులుగా పసుపు, చోడి తదితర పంటలు సాగు చేయాలని, అవసరమైన రుణాలు మంజూరు చేయడంతో పాటు పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పిస్తున్నారు.

సెంచూరియన్‌లో కొత్త కోర్సులు



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఉపాధ్యక్షుడు డి.ఎస్.రావు తదితరులు

పర్లాకిమిడి: సెంచూరియన్ వర్సిటీలో పరిశ్రమలకు అవసరమైన కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నామని ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు తెలిపారు. శనివారం పర్లాకిమిడిలోని వర్సిటీ బోర్డు మీటింగ్ హాలులో నిర్వహించిన సమావేశంలో 'క్యూఈ-2025 ఇండస్ట్రీ రెడీ ప్రోగ్రామ్స్ అడ్మిషన్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణాలతో పాటు మార్కెటింగ్ స్ట్రాటజీ ఉన్నప్పుడే ఉద్యోగావకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. సమావేశంలో అడ్మిషన్ డైరెక్టర్ సుకాంత పరిడా, వైస్ చాన్సలర్ (భువనేశ్వర్) సుప్రియా పట్నాయక్, వీసీ బిశ్వజిత్ మిశ్రా, రిజిస్ట్రార్ అనితా పాత్ర, సెంచూరియన్ విశ్వవిద్యాలయం (విజయనగరం క్యాంపస్) వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి, రిజిస్ట్రార్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

అఫిడవిట్ దాఖలు చేయండి

భువనేశ్వర్: రాష్ట్రంలో తీవ్ర సంచలనం రేపిన భరత్‌పూర్ ఠాణా ఘటనపై న్యాయ విచారణ అంచెలంచెలుగా సాగుతుంది. ఈ ఘటనలో సైనిక అధికారి, అతని స్నేహితురాలి పట్ల విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది అమానుష చర్యకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విశ్రాంత జస్టిస్ చిత్త రంజన్ దాస్ ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించారు. 21 రోజులపాటు న్యాయ విచారణ కమిషను కార్యాలయంలో ఈ ప్రక్రియ నిరవధికంగా కొనసాగుతుందని, ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అఫిడవిటు దాఖలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సాధారణ పౌరులు, పాత్రికేయ ప్రతినిధులు ఎవరైనా ఈ కేసుకు సంబంధించి వివరాలు తెలియజేయవచ్చన్నారు.

గజపతి జిల్లాలో సెమీ కండక్టర్ పరిశ్రమ



తిరుపతి పాణిగ్రాహిని అభినందిస్తున్న ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి

పర్లాకిమిడి: ఒడిశాలో కొత్త పరిశ్రమల స్థాపనకు అనేక మంది పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చారు. న్యూఢిల్లీలో శనివారం జరిగిన సి.ఐ.ఐ. సదస్సులో పర్లాకిమిడికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో పవన్ సర్‌గదమ్ అల్యూమినియం ఇండస్ట్రీ, గజపతి జిల్లాలో పవన్ సర్‌గదమ్ సెమీ కండక్టర్ బయో డైవర్సిటీ పరిశ్రమలను సుమారు రూ.400 నుంచి రూ.600 కోట్లతో ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తిరుపతి పాణిగ్రాహికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం తిరుపతి పాణిగ్రాహి తన ఆత్మకథ పుస్తకాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. అదే విధంగా, పారిశ్రామికవేత్త జగదీష్ ప్రాణ్ ఎక్స్‌పోర్ట్ పరిశ్రమ నెలకొల్పేందుకు ముందుకు వచ్చారు. సమావేశంలో కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి సంపద్ చంద్ర స్వయిని, పరిశ్రమల కార్యదర్శి హేమంత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రావణకాష్ట వేడుకపై ఆంక్షలు

భువనేశ్వర్: కటక్ మహా నగరంలో దసరా ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే రావణ కాష్ట వేడుకపై రాష్ట్ర హైకోర్టు ఆంక్షలు విధించింది. న్యాయవాదుల కమిటి ప్రతిపాదనలకు ఉన్నత న్యాయ స్థానం ఆమోదించి తదనుగుణంగా ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణ అనుకూలమైన బాణసంచా కాల్చేందుకు మాత్రమే అనుమతించింది. ఈ మేరకు ఈ నెల 10వ తేదీకి రంగం సిద్ధం చేయాలని ఉన్నత న్యాయ స్థానం ఆదేశించింది. కటక్ నగరంలోని దిగువబల్లి జాతర మైదానంలో జరిగే వేడుకకు ఏర్పాట్లు చేయాలని కటక్ నగర పాలక సంస్థ సీఎంసీ, జిల్లా యంత్రాంగానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. బరాబటి సర్వ ధర్మ సాంస్కృతిక పరిషత్ దాఖలు చేసిన ఇంటర్వెనింగ్ పిటిషన్ విచారణ పురస్కరించుకుని హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది.

లైంగికదాడి కేసులో పదేళ్ల జైలు శిక్ష

జయపురం: బాలికపై అత్యాచారానికి పాల్పడిన ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ జయపురం స్వతంత్ర పోక్సో జడ్జి శనివారం తీర్పునిచ్చారని కోర్టు స్పెషల్ ప్రభుత్వ న్యాయవాది డాక్టర్ బి.గాయిత్రీదేవి వెల్లడించారు. కేసు విచారణలో భాగంగా 15 మంది సాక్షులను విచారించి 22 ఆధార పత్రాలను పరిశీలించిన తర్వాత నిందితుడిని దోషిగా పేర్కొంటూ తీర్పునిచ్చారని ఆమె వెల్లడించారు. దోషి జరిమానా చెల్లించకపోతే మరో 4 నెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారని తెలిపారు. బాధితురాలికి రూ.6 లక్షలు ఆర్థిక సహాయం అందజేయాలని జిల్లా న్యాయ సేవా ప్రదీకరణను ఆదేశించారు. 2021 అక్టోబర్ 12న బాలిక తన అక్క వద్దకు వెళ్తుండగా నిందితుడు టిటు హియాల్ బాలికను అపహరించి మారుమూల ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. సునాబెడ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేయడంతో.. కేసు విచారించి జడ్జి తీర్పునిచ్చారు.

పులి కాదు కుక్క!

- నకిలీ పులిచర్మంతో నలుగురు అరెస్టు



స్వాధీనం చేసుకున్న చర్మం ఇదే..

రాయగడ: కుక్క చర్మాన్ని పులిచర్మంగా రంగులద్ది విక్రయించేందుకు సిద్ధమవుతున్న నలుగురిని సదరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక రాణిగుడఫారంలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రాణిగుడఫారం వద్ద ముగ్గురు మహిళలు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా నకిలీ పులిచర్మం , మరికొన్ని గోళ్లు లభించాయి. వెంటనే అదుపులోకి తీసుకుని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. చర్మాన్ని ల్యాబ్‌కు తీసుకెళ్లి పరీక్షించగా అది కుక్క చర్మంగా గుర్తించారు. కుక్క చర్మాన్ని పులి చర్మంలా రంగులు అద్దినట్లు గుర్తించారు. గోళ్లు కూడా ప్లాస్టిక్‌విగా గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో 16 ఏళ్ల బాలుడు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కుమార్తెను అప్పగించండి

జయపురం: రెండున్నరేళ్ల తన బిడ్డను అత్తయ్య పట్టుకుపోయిందని, వెంటనే తన పాపను అప్పగించాలని కోరుతూ ప్రమీళ హరిజన్ అనే మహిళ బొరిగుమ్మ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. వరకట్నం వేధింపులు తాళలేక రెండేళ్ల కిందట కన్నవారింటికి వచ్చేశానని, తాను ఇంటి వద్ద లేని సమయం చూసి అత్తయ్య బలవంతంగా బిడ్డను ఎత్తుకుపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని కోరారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీబస్సుల సంగతి తేల్చండి

- 7వ తేదీలోగా ప్రభుత్వ వైఖరి చెప్పకపోతే నిరవధిక సమ్మె
- ప్రైవేటు బస్సు యజమానుల సంఘం ప్రకటన



భువనేశ్వర్: రాష్ట్రంలో లక్ష్మీబస్సుల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ వ్యవస్థకు ఆదిలోనే అవాంతరాలు ఎదురయ్యాయి. ముఖ్యంగా ప్రైవేటు బస్సు యజమానులు వీటిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బస్సుల విస్తరణ దాదాపు కనుమరుగు కావడం, మలి విడత కింద లక్ష్మీ బస్సులు ప్రవేశ పెట్టే యోచన విరమించుకోవడంతో ఈ వ్యవస్థని పూర్తిగా నివారించాలనే ఒత్తిడి రోజురోజుకూ పెరుగుతోంది. తొలి విడత అమలుతో తలెత్తిన వ్యతిరేకతని సార్వత్రిక ఎన్నికల సమయంలో తాత్కాలికంగా వాయిదా వేసినట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 4 నెలలు పూర్తి కావస్తున్నా ఈ వివాదంపై ఎటూ తేల్చడం లేదు. ఈవ్యవస్థ పట్ల రాష్ట్ర ప్రభుత్వం వైఖరి ఈ నెల 7వ తేదీ సాయంత్రంలోగా తెలియజేయకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని బొలంగీర్ ప్రైవేటు బస్సు యజమానుల సంఘం అధ్యక్షుడు చొగొలా పరిచ్ఛా ప్రకటించారు.

• దాండియా నృత్యకేళి



పర్లాకిమిడిలోని కాలేజీ రోడ్డులో నీలమ్మ గుడి వద్ద దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం స్థానిక మహిళలు దాండియా నృత్యాలతో ఆకట్టుకున్నారు. చిన్నా, పెద్ద కలిసి సందడి చేశారు.

- పర్లాకిమిడి


• నగరుశివారులో మొసలి



భువనేశ్వర్ నగర శివారులోని కువాఖాయి నదీ తీరంలో శనివారం ఓ మొసలి హల్‌చల్ సృష్టించింది. ఓవైపు ఏనుగుల చొరబాటుతో క్షణక్షణం భయంగా గడుపుతున్న నగరవాసులకు నదీ తీరంలో మొసలి తారసపడటంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు.

- భువనేశ్వర్

• బంగాళదుంపలో బల్లి



భువనేశ్వర్ నగర పరిధిలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్లో శుక్రవారం రాత్రి విద్యార్థులకు వడ్డించిన బంగాళదుంప కూరలో బల్లి కనిపించింది. దీంతో యాజమాన్యం తీరుపై విద్యార్థులు ఆందోళనకు దిగడంతో చంద్రశేఖరపూర్ ఠాణా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సద్దుమణిగించారు.

- భువనేశ్వర్

క్లుప్తంగా

బీజేపీ బలోపేతానికి కృషి



పూర్ణిమ నాయిక్‌తో బీజేడీ నేతలు

జయపురం: దేశంలో అతిపెద్ద రాజకీయ పార్టీగా ఉన్న బీజేపీని రాష్ట్రంలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పూర్ణిమా నాయిక్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సుమంత ప్రధాన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రజామోద పాలనతో బీజేపీ వరుసగా మూడు ఎన్నికల్లో విజయం సాధించిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా కొరాపుట్ జిల్లాలో బలహీనంగా ఉందని, సమష్టిగా కృషి పార్టీని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వాలను మెరుగుపర్చాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ దేవేంద్ర మహంతి, శాశ్వత కార్యవర్గ సభ్యులు గౌతమ సామంతరాయ్ తదితరులు పాల్గొన్నారు.

8న జాబ్‌మేళా

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 8వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.లత తెలిపారు. డిగ్రీ, ఐటీఐ ఫిట్టర్, ఎంఎస్సీ కెమిస్ట్రీ, డిప్లమా సివిల్, బీటెక్, మెకానికల్ డిగ్రీ కంప్యూటర్స్ చదువుకున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని 8న సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. అపోలో ఫార్మసీ, ఆర్‌వైకే టిక్, హెట్రో, హెచ్‌డీఎఫ్‌సీ, డైకిన్ కంపెనీల నుంచి ప్రతినిధులు వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు కె.గోవిందరావు (9949900672), జి.గౌతం(9550967353) లను సంప్రదించాలని సూచించారు.

నగదు చెక్కు అందజేత

శ్రీకాకుళం క్రైమ్ : అనారోగ్యంతో మరణించిన హోంగార్డు కుటుంబానికి తోటి హోంగార్డుల ఒక్క రోజు వేతనం రూ. 4.29 లక్షల నగదు చెక్కును ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అందజేశారు. జిల్లా హోంగార్డు యూనిట్‌లో పనిచేస్తున్న జి.సురేష్ ఇటీవల మరణించడంతో అతని భార్య దుర్గాభవానీని శనివారం జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపించి ఈ చెక్కును ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి సహాయం కావాలన్నా జిల్లా పోలీసు శాఖ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ వివేకానంద, ఏఓ సీహెచ్ గోపీనాథ్, ఆర్ఎస్ఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి క్రికెట్ క్రీడాకారిణుల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌యూకేటీ) ప్రీ యూనివర్సిటీ కోర్సు విద్యార్థినులు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు అండర్–19 విభాగంలో ఎంపికయ్యారు. శ్రీకాకుళంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో వీరు రాష్ట్ర స్థాయిలో ఆడేందుకు అర్హత సాధించారు. ఈ క్రీడాకారిణులు సీహెచ్ దీపిక, ఎస్.తేజశ్విని, కె.మేఘన, వై.మౌనికలు ఎంపికయ్యారు. వీరిని శనివారం క్యాంపస్‌లో డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన కృష్ణ చౌదరిలతో కూడిన అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. క్యాంపస్‌లో ప్రత్యేక సాధనకు అవకాశం కల్పిస్తామని అన్నారు.

పాపకు రక్తదానం



రక్తదానం చేస్తున్న రమణమూర్తి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని విజయ్‌హర్ష తల్లీపిల్లల వైద్యశాలలో డెంగీ జ్వరంతో చేరిన నిరుపమ(4)కు అంపోలుకు చెందిన వీరఘట్టపు రమణమూర్తి తన రక్తం అందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. అరసవల్లికి చెందిన పి.శివప్రసాద్ కుమార్తె డెంగీ జ్వరంతో ఆస్పత్రిలో చేరగా ప్లేట్ లెట్స్ కౌంట్ తగ్గింది. ఆ పాపకు ఎ నెగెటివ్ ఎస్‌డీపీ(సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్) అవసరం ఏర్పడింది. అరుదైన బ్లడ్ గ్రూపు కావడంతో మదర్స్ లవ్ ఫౌండేషన్ ప్రతినిధి సుప్రజ రౌత్, సభ్యులు అల్లాడ నవీన్‌ల ద్వారా అంపోలుకు చెందిన రమణమూర్తిని సంప్రదించగా ఆయన రక్తదానం చేశారు. ఇలాంటి అరుదైన ఏ నెగెటివ్ రక్తదాతలు ఎవరైనా ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సూపర్‌వైజర్ ఆర్.వెంకటేష్, నంది ఉమాశంకర్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆది, సోమవారాల్లో అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. పాఠశాలలోనే స్టూడెంట్లకు వసతి కల్పిస్తున్నారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి 156 మంది హాజరు కానున్నారు. జిల్లా పీడీ, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షులు మొజ్జాడ వెంకటరమణ ఆధ్వర్యంలోని పీడీలు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.



రాయగడ : మజ్జిగౌరి అమ్మవారు



రాయగడ : గాయత్రీదేవిగా లక్ష్మీ అమ్మవారు



పర్లాకిమిడి: నీలమ్మ గుడిలో దుర్గాదేవి



పర్లాకిమిడి: తెలుగు సొండి వీధిలో దుర్గాపెండాల్



మల్కన్‌గిరి: ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

గాయత్రీమాతా పాహిమాం!



పర్లాకిమిడి: దోలాట్యాంకు రోడ్డులో దండుమారెమ్మ ఉత్సవాలు



మల్కన్‌గిరి: హోమం గుండం వద్ద దంపతులు



పర్లాకిమిడి: దండుమారెమ్మ గుడి వద్ద ప్రత్యేక ఆకర్షణగా స్వాగత ద్వారం



పర్లాకిమిడి: ఆకట్టుకున్న విద్యుద్దీపాలంకరణ

రాయగడ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు గాయత్రీమాత రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాయగడలోని కస్తూరీనగర్ సత్యనారాయణ మందిరంలో లక్ష్మీ అమ్మవారిని గాయాత్రీదేవిగా అలంకరించారు. ఉత్కళాంధ్రుల ఇలవేల్పు మజ్జిగౌరి అమ్మవారు సునాబేసాతో పాటు పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పర్లాకిమిడి: పట్టణంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక గ్రామదేవత నీలమ్మ గుడిలో దుర్గాదేవి విగ్రహం వద్ద మహిళలు అఖండ దీపాలు వెలిగించారు. తెలుగు సొండివీధిలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి సాయంత్రం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు.

● మల్కన్‌గిరిలోని దుర్గాదేవి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమ పూజలు అనంతరం హోమాలు జరిపించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఉపాధితోనే వలసలకు అడ్డుకట్ట



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ప్రదీప్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహానా బ్లాక్‌లో అనేక సమస్యలు ప్రజలను వెంటాడుతున్నాయని, ముఖ్యంగా వలసలు అరికట్టాలని బరంపురం ఎంపీ ప్రదీప్ పాణిగ్రాహి అన్నారు. శనివారం మోహానా బ్లాక్ కార్యాలయంలో పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో మాట్లాడుతూ పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. మోహనా బ్లాక్‌లో 39 పంచాయతీల్లో ఉపాధి లేక యువకులు ఇతర రాష్ట్రాలకు వలసబాట పడుతున్నారని చెప్పారు. అనంతరం పలువురు పంచాయతీ ప్రతినిధులు మాట్లాడుతూ అసిస్టెంట్ ఇంజినీర్లు సకాలంలో పనులు చేయడం లేదని ఎంపీకి ఫిర్యాదు చేశారు.

సమావేశంలో మోహానా బ్లాక్ అధ్యక్షుడు రాజీవ్ శబర్, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు కుంతలా మల్లిక్, బ్లాక్ ఉపాధ్యక్షులు బలిమెలా అధికారి, తహశీల్దారు సత్యబాన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన అధికార ప్రతినిధులు

ఆలయంలో చోరీ



సిద్ధ మహా వీర్ ఆలయం

భువనేశ్వర్: సిద్ధ మహావీర్ ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వీర హనుమంతుని ఆభరణాలు దోచుకున్నారు. హుండీలో నగదు దొంగిలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పూరీ జిల్లా జొంగొలొ బొరి పంచాయతీ మధువన్ గ్రామంలో సిద్ధ మహావీర్ మందిరం ఉంది. రాత్రిపూట మందిరం తలుపులు విరగ్గొట్టి లోపలికి చొరబడిన దుండగులు హనుమంతుడి 3 వెండి కిరీటాలు, 3 హారాలు, ఒక గద, ఒక ఛత్రం, 2 పాదాలు, 2 నేత్రాలు, గంట దొంగిలించి రూ.20 వేల నగదు దోచుకున్నారు. శనివారం ఉదయం అర్చకుడు వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండటంతో స్థానికుల సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. నయాహట్ ఔటు పోస్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

గంజాయి కేసులో నిందితుడు అరెస్టు



కరుణ్ సిసా

మల్కన్‌గిరి : గంజాయి కేసులో నిందితుడిని బలిమెల పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఏప్రిల్ నెలలో కోరుకొండ సమితి సోమనాథ్‌పూర్ పంచాయతీ నువాగూడ గ్రామంలో కరుణ్ సిసా అనే వ్యక్తి ఇంట్లో బలిమెల పోలీసులు తనిఖీలు చేపట్టారు. 50 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాక తెలుసుకున్న కరుణ్ అప్పట్లో పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. శనివారం కుడుములగుమ్మ వారపు సంతలో కరుణ్‌ను గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని బలిమెల ఐఐసీ సుమన్ పట్నాయక్ తెలిపారు.

గంజాయి రవాణా గుట్టురట్టు



ఆటోలోని సీక్రెట్ చాంబర్ నుంచి గంజాయిని తీస్తున్న పోలీసులు

జయపురం : ఆటోలో రహస్యంగా గంజాయిని తరలిస్తున్న ముఠా గుట్టు రట్టయ్యింది. విశ్వసనీయవర్గాల ద్వారా సమాచారం అందుకున్న కొరాపుట్ ఎస్పీ వెంటనే చర్యలు చేపట్టాలని నందపూర్ సబ్ డివిజన్ పోలీసు అధికారి సంబిత్‌కుమార్ మాఝిని ఆదేశించారు. ఆయన ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి నందపూర్ కార్యాలయ సమీపంలో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ వైపు నుంచి ఓ ఆటో అతివేగంగా వస్తూ పోలీసులను చూసి డ్రైవర్ వాహనం ఆపేసి పరారయ్యాడు. వెంటనే వెళ్లి చూడగా ఆటోలోని రహస్య చాంబర్‌లో 90 కేజీల గంజాయిని గుర్తించారు. దీని విలువ రూ.9 లక్షలు ఉంటుందని వెల్లడించారు. ఆటో నంబర్ ఆధారంగా యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

42,032 మంది రైతులకు పీఎం కిసాన్



మాట్లాడుతున్న కలెక్టర్ పట్వారి

రాయగడ: ప్రధానమంత్రి కిసాన్ యోజనలో భాగంగా జిల్లాలో 42,032 మంది రైతుల ఖాతాల్లో రూ.రెండు వేలు చొప్పున నగదు జమ అయినట్లు కలెక్టర్ ఫరూల్ పట్వారి తెలిపారు. శనివారం స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. ప్రధాని నరేంద్ర మోదీ మహారాష్ట్రలో నిర్వహించిన పథకం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా కాశీపూర్‌లో 5958 మంది రైతులు, అత్యల్పంగా చంద్రపూర్ సమితిలో 2128 మంది రైతులు పథకం అందుకున్నారని వివరించారు. ఏటా ఆరు వేల రుపాయల నగదు ప్రతి రైతు ఖాతాలో జమవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీఎం కిసాన్ యోజన కూడా రైతులకు అందుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య వ్యవసాయ శాఖ అధికారి విష్ణుప్రసాద్ ఖరే, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



హాజరైన రైతులు, అధికారులు

దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం



కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

జయపురం: దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకమని మాజీ ఎమ్మెల్యే, గోపాలకృష్ణ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు గుప్తప్రసాద్ దాస్ అన్నారు. శనివారం జయపురం సమితి రాణిపుట్‌లో గోపాలకృష్ణ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఇంజినీర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయ ఎడ్యుకేషన్ విభాగం చీఫ్ డాక్టర్ మనోరంజన్ ప్రధాన్ ముఖ్యవక్తగా పాల్గొని ఇంజినీరింగ్ విద్య ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు దీనబంధు రౌత్, కోశాధ్యక్షుడు బిశ్వనాథ్ జెనా, యాజమాన్య కమిటీ సభ్యులు సిమాంచల నాయిక్, బలరామ్ బొడొత్య, పాలిటెక్నికల్ విభాగ అధ్యక్షులు నివేదిత పాత్రో, ఐటీఐ విభాగ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ భూమిక పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

రాయగడ: ప్రజలకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా సదరు సమితి పరిధిలోని కూలి గ్రామంలో రూ.9 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కడ్రక శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులు కల్యాణ మండపాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా రూ.3.5 లక్షల వ్యయంతో మండపం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్క్‌ను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం బొడొఅలుబడి గ్రామంలో వారపు సంత షెడ్లు ప్రారంభించారు. సుమారు 20 గ్రామాల ప్రజలు వస్తువుల క్రయవిక్రయాలకు షెడ్లు అనుకూలంగా ఉంటాయని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో రాయగడ సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, వైస్ చైర్మన్ హరప్రసాద్ హెప్రుక తదితరులు పాల్గొన్నారు.



కల్యాణమండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలస్వామి



మండపం ప్రాంగణంలో ఏర్పాటైన పార్క్



సంత సముదాయం

పేపర్‌మిల్లు మూడో యూనియన్ కార్యవర్గ ఎన్నిక

జయపురం: జయపురం సేవా పేపరు మిల్లులో మూడో కార్మిక యూనియన్ వార్షిక సమావేశం శనివారం మిల్లు ప్రాంగణంలో నిర్వహించారు. యూనియన్ సలహాదారు తారాప్రసాద్ ప్రధాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాతీయ పేపర్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు సుధాంశు శేఖర పాఢీ పాల్గొని కార్మిక సమస్యలపై చర్చించారు. అనంతరం మూడో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అమన్ ఉజబిన్ నాయిక్, కార్యదర్శిగా రబి నారాయణ శెఠి, ఉపాధ్యక్షులుగా భగవాన్ చౌధురి, సాధారణ కార్యదర్శిగా అభయ కుమార్ ప్రధాన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సుదర్శన్ శెఠి, కోశాధికారిగా ముక్తార సింగ్, కార్యవర్గ సభ్యులుగా టునా మహాపాత్రో, కేశవ జోషి, చింతలదొర, దిగంబర ఖొర, విక్రమపంగిలను ఎన్నుకున్నారు. సమావేశంలో బి.ఎం.ఎస్ జిల్లా అధ్యక్షులు ఎ.భీమారావు, కార్యదర్శి బిరంచి నారాయణ షాడంగి తదితరులు పాల్గొన్నారు.

● చిల్లర కొరతకు చెక్



కౌంటర్ వద్ద పోటెత్తిన జనం

జయపురం: జయపురంలో చిల్లర నోట్లకు కొరత ఏర్పడిన నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు శనివారం బిద్యాధర దైనిక బజారులో చిల్లర నోట్ల కౌంటర్ ఏర్పాటు చేశారు. బ్యాంకు ఏజీఎం సుభాష్‌కుమార్ బెహరా హాజరై నోట్లు, కాయిన్లను అవసరమైన వారికి అందజేశారు.

క్లుప్తంగా

బాలలను పనిలో పెడితే చర్యలు



తనిఖీలు చేస్తున్న సీఐ సతీష్‌కుమార్

బొబ్బిలి: బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కె. సతీష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పలు దుకాణాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులను పనిలో పెట్టుకున్న ఆరుగురు దుకాణ యజమానులపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గౌరీశంకర్, ఐసీడీఎస్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని ఓ జూట్ మిల్లులో విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందాడు. ఎస్సై వై.రవికిరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కంచరాం గ్రామానికి చెందిన తొగురోతు చిన్నారావు (30) జూట్‌మిల్లులో పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని వస్తుండగా... ఫ్యాక్టరీ ఆవరణలో ఉన్న విద్యుత్ స్తంభానికి ప్రమాదవశాత్తూ తగిలి మృతి చెందాడు. మృతుడి భార్య చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వేపాడ: మండలంలోని కొత్త బొద్దాం సమీపంలో విశాఖ – అరుకు రోడ్డుపై గత ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇందుకూరి లక్ష్మీపతిరాజు చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై బి. దేవి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గత నెల 29న ఎస్.కోట నుంచి కొత్తవలస వైపు ద్విచక్ర వాహనంపై లక్ష్మీపతిరాజు వెళ్తున్నాడు. కొత్త బొద్దాం వద్దకు వచ్చేసరికి వాహనం అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి విశాఖ కేజీహెచ్‌కు తరలించగా... అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్తా చూపారు



క్రీడాకారిణులు హారిక, మౌనికలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కేశవరావు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల జరిగిన ఆంధ్రా యూనివర్సిటీ అంతర్ కళాశాలల బాడ్మింటన్ పోటీల్లో కళాశాల విద్యార్థులు టీమ్ చాంపియన్‌షిప్ మహిళా విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. క్రీడాకారిణులు పంపాన మౌనిక, భరిణికాన హారికతో పాటు కోచ్ ఆర్.శివకుమార్‌ను ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు, మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పి.శ్రీరాములు శనివారం అభినందించారు.

మరీ ఇంత అలసత్వమా..?

- గర్భిణుల పేర్లు నమోదులో వెనుకబాటు..
- వైద్య తనిఖీల్లోనూ అదే తంతు
- ఆగస్టు నెలఖారు నాటికి 13,642 మంది వివరాలు రిజిస్ట్రేషన్ చేయాలి
- 11, 662 మందికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేసిన వైనం



గంట్యాడ మండలం పెదవేమలిలో గర్భిణుల వివరాలు రిజిస్ట్రేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: గర్భిణుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయడంలో వైద్య సిబ్బంది అలసత్వం వహిస్తున్నారు. దీంతో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. గర్భిణులకు జరగాల్సిన వైద్య తనిఖీలు కూడా పూర్తి స్థాయిలో జరగడం లేదు. గర్భిణుల వివరాలు సకాలంలో నమోదు చేస్తే వారికి ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే చికిత్స అందించడానికి అవకాశం ఉంటుంది. అదే రిజిస్ట్రేషన్ చేయకపోతే చికిత్స అందక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది.

12 వారాల్లోగా..

గర్భం దాల్చిన 12 వారాల్లోగా గర్భిణుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయాలి. రిజిస్ట్రేషన్ సమయంలోనే గర్భిణికి హెచ్‌బీ (హిమోగ్లోబిన్) పరీక్ష చేస్తారు. అలాగే టీటీ ఇంజక్షన్, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు కూడా ఇస్తారు. రిజిస్ట్రేషన్ సయంలోనే గర్భిణి ఆరోగ్య వివరాలతో పాటు ఆధార్, ఫోన్ నంబర్, తదితర వివరాలు నమోదు చేసుకుంటారు.

నాలుగు సార్లు తనిఖీలు..

ప్రతి గర్భిణికి ప్రసవం అయ్యేలోగా నాలుగుమ సార్లు వైద్య తనిఖీలు చేయాలి. ఈ వైద్య తనిఖీలు సంబంధిత పీహెచ్‌సీ వైద్యులు చేయాల్సి ఉంటుంది. గర్భం దాల్చిన 12 వారాలకు, 16 వారాలకు , 28 వారాలకు , 32 వారాల తర్వాత వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వైద్య తనిఖీలు చేసే సమయంలో ఏదైనా ఆరోగ్య సమస్య గుర్తిస్తే వెంటనే చికిత్స అందిస్తారు. అదేవిధంగా గర్భిణి హైరిస్క్‌లో ఉన్నట్లయితే ప్రత్యేక చికిత్స అందిస్తారు.

13,642 రిజిస్ట్రేషన్లు జరగాలి..

2024 ఏప్రిల్ నుంచి ఆగస్టు నెలఖారు నాటికి 13,642 మంది పేర్లు రిజిస్ట్రేషన్ చేయాలి. కాని 11, 662 మంది వివరాలు మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో గర్భిణులకు పూర్తి స్థాయిలో వైద్య తనిఖీలు జరగలేదు. 11,662 మందికి నాలుగు సారు వైద్య తనిఖీలు చేయాల్సి ఉండగా.. 10,192 మందికి మాత్రమే నాలుగుసార్లు పరీక్షలు జరిగాయి. ఇంకా 1470 మంది వైద్య తనిఖీలు జరగలేదు.

ఆదేశించాం..

గర్భం దాల్చిన 12 వారాల్లోగా గర్భిణుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయాలని వైద్య సిబ్బందికి ఆదేశాలిచ్చాం. అదేవిధంగా గర్భిణులందరికీ నాలుగు సార్లు తనిఖీలు చేయాలని సిబ్బందికి సూచించాం. గర్భిణుల రిజిస్ట్రేషన్, వైద్య తనిఖీల విషయంలో అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ ఎస్. భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

అల్లర్లు తలెత్తకుండా చర్యలు చేపట్టండి

- ఎస్పీ వకుల్ జిందల్



విజయనగరం క్రైమ్: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఎటువంటి అల్లర్లు తలెత్తకుండా ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. విగ్రహాలను నిమజ్జనం చేసే నదులు, చెరువుల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఊరేగింపులు ఇతర ప్రార్థనా మందిరాల మీదుగా వెళ్లే సమయాల్లో మరికొంత జాగ్రత్తగా వ్య వహరించాలని, ఎటువంటి మత ఘర్షణలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఊరేగింపుల సమాచారాన్ని ముందస్తుగా తెలుసుకోవాలని సూచించారు. ఈ సమయంలో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎటువంటి అశ్లీలత లేకుండా చూడాలని, నిర్దిష్ట సమయం వరకు మాత్రమే ప్రదర్శనలకు అవకాశం ఇవ్వాలని స్పష్టం చేశారు.

వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే చికిత్స

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: క్షయ, కుష్టు వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే చికిత్స ప్రారంభించాలని డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో క్షయ, కుష్టు వ్యాధిపై పీహెచ్‌సీ వైద్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధుల వ్యాప్తిని తగ్గించవచ్చన్నారు. ఉమ్మి తుంపరల ద్వారా క్షయ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది కాబట్టి త్వరగా గుర్తించాలని సూచించారు. మందులు మధ్యలో మానేస్తే వ్యాధి తీవ్రతరం అవుతుందన్న విషయం రోగులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ కె.రాణి, న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ ఎ.అర్చనాదేవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ బస్టాండ్ సమీపంలో గల భవానీ పీఠం వద్దనున్న దేవస్థానం స్థలంలో (సర్వే నంబర్ 89/2) అక్రమ నిర్మాణం చేపడుతున్నారని గ్రామానికి చెందిన వాసుపల్లి సురేష్ తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ గోవింద్‌ను శనివారం కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ స్పందిస్తూ వెంటనే నిర్మాణాన్ని పరిశీలించి, నిలిపివేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇదిలా ఉంటే కోనాడ దేవస్థానం ఈఓ జగదేశ్వరి నిర్మాణాన్ని శనివారం మధ్యాహ్నం పరిశీలించి, నిర్మాణాలు చేపట్టకూడదని బాధ్యులను హెచ్చరించారు.



తహసీల్దార్ గోవింద్‌కు ఫిర్యాదు చేస్తున్న కోనాడ ప్రజాప్రతినిధి సురేష్

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు





పైడితల్లి జాతరలో భాగంగా వనంగుడి వద్ద శనివారం రాత్రి విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి పాటలకు విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమాలను దేవదాయశాఖ సిబ్బంది పర్యవేక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

రాష్ట్ర ఖోఖో బాలికల జట్టు ఇదే

- 16,17,18 తేదీల్లో జాతీయస్థాయి ఖేలో ఇండియా పోటీలు
- 7వ తేదీ నుంచి నెల్లూరులో శిక్షణ శిబిరం



అండర్-14 రాష్ట్ర ఖోఖో జట్టు

జే.పంగులూరు: జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర బాలికల జట్టును ఎంపికచేశారు. శనివారం పంగులూరులోని స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని క్రీడా ప్రాంగణంలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో అండర్-17, అండర్-14 విభాగంలో రాష్ట్ర బాలికల ఖోఖో జట్టు ఎంపిక నిర్వహించారు. ఈ ఎంపికలో రాష్ట్రం నలుమూల నుంచి 100 మందిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో మంచి ప్రతిభకనబరిచిన బాలికలను ఎంపిక చేసినట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. ఎంపికైన రెండు జట్లు ఈనెల 16,17,18 తేదీల్లో తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగే జాతీయస్థాయి ఖేలో ఇండియా ఖోఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరికి ఈనెల 7వ తేదీ నుంచి నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈఎంపికలో రాష్ట్ర రిఫరీస్ బోర్డ్ కన్వీనర్ ఎంవీఎస్ఎస్ ప్రసాద్ (కృష్ణా జిల్లా), బాపట్ల కోచ్ జే పాల్, ప్రకాశం జిల్లా కోచ్ డీఎల్ లక్ష్మినారాయణరెడ్డి, కడప జిల్లాకు చెందిన పీడీ ఎం పవన్‌కుమార్, సోమేశ్వరరావు (కృష్ణా జిల్లా), వి రఘుబాబు (ఇడుపులపాడు), సావిత్రమ్మ (కనిగిరి), లత (శ్రీకాకుళం), రత్తయ్య (కారంపూడి), శ్రీనివాసరావు, రాంబాబు, (తూర్పుగోదావరి), కే వీరాంజనేయులు, కె రామారావు (ముండ్లమూరు), సోమశేఖర్‌రెడ్డి (ఈదర)తదితరులు పాల్గొన్నారు.

అండర్ -14 విభాగంలో రాష్ట్ర ఖోఖో బాలికల జట్టు.. కే భవాని (నెల్లూరు), షేక్ గౌస్య (నెల్లూరు), ఎం హారిక (శ్రీకాకుళం), ఎం యువశ్రీ (చిత్తూరు), జీ చందన (శ్రీకాకుళం), ఎం చందన లక్ష్మి (విజయనగరం), ఏ హేమలత (ప్రకాశం), బీ ఐశ్వర్య (ప్రకాశం), షేక్ మనీషా (గుంటూరు), జీ హరిత (కడప), పవి గనిలక్ష్మి (తూర్పుగోదావరి), ఎస్ హారిక (విజయనగరం), కావేరి (అనంతపురం), డీ వినేష్ (కృష్ణా), హారిక (కర్నూలు), జీ గురవమ్మ (ప్రకాశం).

అండర్-17 విభాగంలో రాష్ట్ర ఖోఖో బాలికల జట్టు.. కేకే ప్రీతి (నెల్లూరు), ఎస్ శ్రవంతి (నెల్లూరు), ఆర్ జాహ్నవి (విజయనగరం), ఏ పురందేశ్వరి (ప్రకాశం), టీ సుమతి (ప్రకాశం), కే స్వప్న (అనంతపురం), ఆర్ తనూజ (శ్రీకాకుళం), జీ భవాని (శ్రీకాకుళం), ఎస్ తేజశ్రీ (శ్రీకాకుళం), పి అర్చనశ్రీ (కర్నూలు), స్రవంతి (కడప), బీ స్వాతి (తూర్పుగోదావరి), జీ అనిత (కృష్ణా), డీ లక్ష్మి (గుంటూరు), పీ జ్యోత్స్న (విశాఖపట్నం), సత్యవతి (చిత్తూరు), మణిచంద్రిక (తూర్పుగోదావరి).



అండర్-17 రాష్ట్ర ఖోఖో బాలికల జట్టు



ఎంపిక పోటీలలో ప్రతిభ కనబరుస్తున్న బాలికలు

మళ్లీ మింగేస్తారా..?

- కూటమి నాయకులకే 'ఉపాధి' పనులు
- గతంలో కూడా నిధులు మింగేసిన టీడీపీ నాయకులు
- తాజాగా జిల్లా వ్యాప్తంగా 2199 పనులకు రూ.152 కోట్ల అంచనాలతో నిధులు మంజూరు
- నీరు – చెట్టు పథకం మాదిరిగా నిధులు కొల్లగొట్టేందుకు టీడీపీ నేతల కార్యాచరణ
- సీసీ రోడ్లు, కల్వర్టులు, కాలువల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్



2015-18 మధ్య టీడీపీ పాలనా కాలంలో కోటశిర్లాంలో నాసిరకంగా నిర్మించిన చెక్‌డ్యామ్



ముచ్చర్లవలసలో శిథిలావస్థకు చేరిన సామూహిక మరుగుదొడ్లు

రామభద్రపురం: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులపై టీడీపీ నేతల కన్నుపడింది. గ్రామాల్లో వలసలు నివారించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం నిధులు బొక్కేందుకు కసరత్తు మొదలైంది. సిమెంట్, కంకర రోడ్లకు ఉపాధి నిధులు కేటాయించి టీడీపీ నాయకులు, వారి అనుచరులకు పంచిపెట్టే చర్య ఆరంభమైంది. ఇప్పటికే గ్రామసభలు నిర్వహించి వాటి ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, కల్వర్టులు నిర్మించేలా విన్నపాలు స్వీకరించారు. ఈ విన్నపాల ప్రకారం జిల్లాలో 2199 పనులకు రూ.152 కోట్ల అంచనాలతో నిధులు మంజూరు చేశారు. ఆయా పనులను మండలాల వారీగా గ్రామాల్లోని టీడీపీ నాయుకులకు పంచేశారు.

థర్డ్ పార్టీ వెండర్‌గా రిజిస్ట్రేషన్లు..

అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన వారికే పనులు దక్కాయి. మెటీరియల్ కాంపొనెంట్ కింద ఉపాధి నిధులతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టెండర్లతో పని లేకుండా సాగే ఈ పనులన్నింటినీ టీడీపీ నాయకులే చేపట్టనున్నారు. థర్డ్ పార్టీతో వెండర్ రిజిస్ట్రేషన్ చేసి వారి ద్వారా పనులు చేయించేందుకు పక్కా స్కెచ్ వేస్తున్నారు. ప్రస్తుతం టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల వారీగా థర్డ్ పార్టీగా వెండర్ రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు.

అప్పట్లో ఇలా..

2014 నుంచి 2019 వరకు టీడీపీ పాలనా కాలంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు మొత్తం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలోనే సాగాయి. అయితే ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కేంద్ర ప్రభుత్వానికి చెందినవైనా తమవే అన్నట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అప్పట్లో మెటీరియల్ కాంపొనెంట్ కింద చెక్ డ్యామ్‌లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చి అవినీతికి కొత్త భాష్యం చెప్పారు. పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖలతో పాటు వాటర్‌షెడ్ కార్యక్రమాల కింద 2014 సంవత్సరానికి ముందు చేపట్టిన పనులకు పైపై మెరుగులు దిద్దడంతో పాటు కొన్ని పనులు నాసిరకంగా, మరికొన్ని పనులు చేయకుండా ఉపాధి నిధులు కొల్లగొట్టారన్న ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. అలాగే ఇప్పుడు కూడా నిధులు స్వాహా చేసేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.

మండలంలో రూ.4 కోట్లు స్వాహా..

మండలంలో 2015 – 18 మధ్య పంచాయతీరాజ్, జల వనరుల శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.6 కోట్లతో అప్పట్లో టీడీపీ నాయకులు ఉపాధి పనులు చేపట్టారు. అయితే అక్రమాలు, అవకతవకలపై అప్పట్లో విజిలెన్స్ ఎస్పీ టి. హరికృష్ణ పలు గ్రామాలలో తనిఖీలు నిర్వహించారు. ఉపాధి పనులు సక్రమంగా జరగలేదని, కొన్నిచోట్ల పనులు చేపట్టకుండానే బిల్లులు డ్రా చేసినట్లు గుర్తించారు. అలాగే చెక్‌డ్యామ్‌లు, మదుములు, చప్టాలను టెక్నికల్ అనుమతుల్లేకుండా నాసిరకంగా నిర్మించారని నిర్ధారించారు. కొన్ని పనులకు సంబంధించి అధికారుల సంతకాలనే ఫోర్జరీ చేశారని తేల్చారు. రామభద్రపురం మండలంలో సుమారు నాలుగు కోట్ల రూపాయల వరకు అవకతవకలు జరిగినట్లు నిర్ధారించారు. దీంతో 22 పంచాయతీలకు చెక్ పవర్ రద్దు, 24 మంది అధికారులను సస్పెండ్ చేయడంతో మండలం పేరు అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా వినిపించింది.

మరుగుదొడ్లలోనూ మింగేశారు..

గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి మంజూరు చేశారు. ఒక్కో మరుగుదొడ్డికి రూ. 15 వేలు చొప్పున విడుదల చేశారు. అయితే అప్పట్లో టీడీపీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి నాసిరకంగా నిర్మాణాలు చేపట్టి డబ్బులు దండుకున్నారు. అప్పట్లో అధికారులు కూడా అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారి నిధులు మంజూరు చేశారనే ఆరోపణలు వినిపించాయి. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మళ్లీ టీడీపీ నాయకులు పనులు చేపట్టడానికి ముందుకు వస్తుండడంతో ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పారదర్శకంగా పనులు..

ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్ కాంపొనెంట్ కింద నిర్మాణాలు చేపట్టేందుకు జిల్లా వ్యాప్తంగా 2199 పనులకు రూ.152 కోట్ల అంచనాతో నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో ఏమి జరిగిందో తెలియదు. ప్రస్తుతం గ్రామసభల ద్వారా ఆమోదం పొందిన పనులు పారదర్శకంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. అలాగే అక్రమాలకు తావులేకుండా ఇంజినీరింగ్ శాఖాధికారులతో పనులు పరిశీలిస్తాం.

– శ్రీనివాస్, ఎస్ఈ, విజయనగరం



కల్వర్టు నిర్మించాల్సిన ప్రదేశం

దాడితల్లికి 108 రకాల ప్రసాదాల నివేదన



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బొబ్బిలి బైపాస్ రోడ్డులోని దాడితల్లి అమ్మవారిని శనివారం అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. 108 రకాల పిండివంటకాలను నైవేద్యంగా సమర్పించారు. అర్చకుడు పిండిప్రోలు మణికుమార్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. – బొబ్బిలి

13, 14 తేదీల్లో క్రీడోత్సవాలు



క్రీడోత్సవాల నిర్వహణపై సమీక్షిస్తున్న జిల్లా క్రీడాధికారి

విజయనగరం: విజయనగరం జిల్లా ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 13, 14 తేదీల్లో క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు పోటీలు నిర్వహించే విజ్జి స్టేడియంలో వివిధ అసోసియేషన్‌ల ప్రతినిధులు, అధికారులతో శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే క్రీడా పోటీల్లో భాగంగా విజయనగరంతో పాటు పార్వతీపురంమన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, పాడేరు జిల్లాలకు చెందిన క్రీడాకారులకు అవకాశం కల్పిస్తున్నట్టు వెల్లడించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, స్కేటింగ్ క్రీడాంశాల్లో ఈ పోటీలు జరుగుతాయని, పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే క్రీడాకారులకు అవసరమైన భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. సమావేశంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కె.వి.ప్రభావతి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వీఎస్ ప్రసాద్, ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి సత్యనారాయణ, వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి టి.వి.భగవాన్‌దాస్, ఐవీపీ రాజు, తదితరులు పాల్గొన్నారు.